నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, బుధవారం 21 మే 2025 | KAMAREDDY

కేసీఆర్ ప్రతిష్టను దెబ్బ తీయాలనే కుట్రతోనే నోటీసులు

ఎమ్మెల్సీ కవిత

కంఠేశ్వర్, మే 20 : రాజకీయ కక్షతో కేసీఆర్ ప్రతిష్టను దెబ్బ తీయడానికే కాళేశ్వరం కమిషన్ పేరుతో నోటీసులు ఇచ్చారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో గోదావరి నదిలో తెలంగాణకు హక్కుగా రావాల్సిన నీటి వాటాను కోల్పోతున్నామని ఎంత బాధపడ్డామో అందరికీ తెలుసన్నారు. తెలంగాణను కోటి ఎకరాల మాగాణంగా తీర్చిదిద్దడానికి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టుకు రూపకల్పన చేశారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు మీద కాంగ్రెస్ పార్టీ వారికి మొదటి నుంచి కడుపు మంటగా ఉన్నదనే విషయం అందరికీ తెలిసిందేనని పేర్కొన్నారు. తెలంగాణ, పేదలు బాగు పడడం ఆ పార్టీకి ఎప్పుడూ ఇష్టం ఉండదన్నారు. ప్రజలు ఎప్పటికీ పేదరికంలో ఉంటేనే తమకు పదవులు వస్తాయని భావించే నాయకత్వం కాంగ్రెస్ పార్టీదని విమర్శించారు. కేసీఆర్ తెలంగాణ బీడు భూములన్నింటికీ నీళ్లు వచ్చేలా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీ నాయకులు మొదటి నుంచి కుట్రలు పన్నుతూ అనేక కేసులు వేసిన విషయం కూడా ఈ సందర్భంగా గుర్తు తెచ్చుకోవాలన్నారు. అదే కుట్రలో భాగంగా అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని రోజుల ముందు కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీకి పగళ్లు రావడం ఆ వెనువెంటనే కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఎన్‌డీఎస్‌ఏ అధికారులు పడవల్లో వచ్చి ఫొటోలు తీసి ప్రచారం చేసిన విషయం కూడా అందరికీ తెలిసిందేనని గుర్తుచేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రజలందరినీ గందరగోళానికి గురి చేశారన్నారు. ఈ కుట్రలో భాగంగానే కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన అనంతరం కాళేశ్వరం కమిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. రాష్ట్రాన్ని అద్భుతంగా తీర్చిదిద్దడానికి తన జీవితాన్ని పణంగా పెట్టిన కేసీఆర్‌పై కాంగ్రెస్ చేస్తున్న కుట్రల్లో భాగంగానే ఆయనకు నోటీసులు అందజేశారన్నారు. తెలంగాణ ప్రజల కోసం తన ప్రాణాలను తృణప్రాయంగా భావించి ఆమరణ నిరాహార దీక్ష చేసిన నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రతిష్టను, పేరును దెబ్బ తీయాలనే కుట్రలో భాగంగానే కాంగ్రెస్ పార్టీ ఇలాంటి కమిషన్లు ఏర్పాటు చేసిందని, 'కాళేశ్వరం' తెలంగాణ ప్రజల కోసం నిర్మించిన ప్రాజెక్టు అన్న విషయం గుర్తించాలన్నారు. రాజకీయ కుట్రతో, కక్షతో వేసిన ఇలాంటి కమిషన్లు కాలక్రమంలో తప్పకుండా న్యాయాన్నే గెలిపిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. త్వరలోనే నిజాలన్నీ బయటికి వస్తాయని, పాలు ఏవో నీళ్లు ఏవో ప్రజలకు స్పష్టత వస్తుందన్నారు.

పోలీసుశాఖలో భారీగా బదిలీలు

- 164 మంది పోలీసు సిబ్బందికి స్థానచలనం
- ఉత్తర్వులు జారీ చేసిన సీపీ సాయి చైతన్య

వినాయక్‌నగర్, మే 20: జిల్లాలో సివిల్ ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ పోలీసు కమిషనర్ సాయి చైతన్య మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ డివిజన్ల పరిధిలోని ఒకే పోలీసుస్టేషన్‌లో లాంగ్ స్టాండింగ్‌లో ఏడు, నాలుగు, మూడేండ్లుగా పనిచేస్తున్న వారి వివరాలు సేకరించి, ట్రాన్స్‌ఫర్ చేశారు. ఒకే ఠాణాలో మూడేండ్లుగా పనిచేస్తున్న 22 మంది ఏఎస్సైలు, నాలుగేండ్లు పనిచేస్తున్న 26 మంది హెడ్ కానిస్టేబుళ్లతో పాటు ఏడేండ్లుగా ఒకే స్టేషన్‌లో పనిచేస్తున్న 116 మంది కానిస్టేబుళ్లకు స్థానచలనం కల్పించారు. ట్రాన్స్‌ఫర్ అయిన సిబ్బందిని వెంటనే రిలీవ్ చేయాలని సంబంధిత ఏసీపీలు, సీఐలు, ఎస్సైలకు సూచించారు. బదిలీ అయిన సిబ్బంది త్వరగా తమకు కేటాయించిన పోలీసుస్టేషన్లకు వెళ్లి రిపోర్టు చేయాలని సీపీ ఆదేశాలు జారీచేశారు.

విద్యాప్రమాణాలు మెరుగుపర్చడంలో
ప్రధానోపాధ్యాయులదే కీలక పాత్ర

మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, మే 20 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపర్చడంలో ప్రధానోపాధ్యాయులు కీలక పాత్ర వహించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లిలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐదు రోజుల జిల్లా స్థాయి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్ శిక్షణ కార్యక్రమానికి మంగళవారం కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులు ఎప్పటికప్పుడు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకుంటూ నూతన బోధనా పద్ధతులను మెరుగుపరుచుకొని ఉపాధ్యాయులకు దిశ నిర్దేశం చేయాలని సూచించారు. ఇప్పటికే మొదటి దశ పూర్తయిందని, రెండో దశలో 800 మందికి మారుతున్న కాలానికి అనుగుణంగా శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నాటికే పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో రాజు, అకడమిక్ మానిటరింగ్ అధికారి వేణుగోపాల్, ట్రైనింగ్ సెంటర్ ఇన్‌చార్జి గంగాకిషన్, ఏసీజీఈ బలరాం, పరీక్షల కార్యదర్శి నీలం లింగం తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

మాట్లాడుతున్న టీజీఎస్పీ బెటాలియన్స్ డీఐజీ సన్ని

టీజీఎస్పీ బెటాలియన్స్ డీఐజీ సన్ని

డిచ్‌పల్లి, మే 20 : పోలీసులు విధి నిర్వహణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని టీజీఎస్పీ బెటాలియన్స్ డీఐజీ సన్ని సూచించారు. మంచి ఆహారం తీసుకుంటూ తగినంత వ్యాయామం, యోగా చేయాలన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం ఆయన డిచ్‌పల్లిలోని ప్రత్యేక పోలీసు 7వ బెటాలియన్‌ను సందర్శించారు. బెటాలియన్ కమాండెంట్ పి.సత్యనారాయణ ఆధ్వర్యంలో బెటాలియన్ పరేడ్ గ్రౌండ్‌లో ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. పరేడ్‌కు డీఐజీ సన్ని హాజరై పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం బెటాలియన్ సిబ్బంది, అధికారులకు దర్బార్ నిర్వహించి సిబ్బంది అవసరాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బెటాలియన్ ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ కేపీ శరత్‌కుమార్, ఆర్ఐలు త్రిముఖ్, నవనీత్‌కుమార్, వసంత్‌రావు, ఆర్ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

కేసీఆర్‌పై కాంగ్రెస్ సర్కార్ కుట్ర!

- ఆయన ప్రతిష్టను దెబ్బ తీసేందుకే నోటీసులు
- ఇది పూర్తిగా రాజకీయ కక్షపూరిత చర్య
- కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో తెలంగాణను సస్యశ్యామలం చేసిన కేసీఆర్
- కాళేశ్వరం కమిషన్ నోటీసులు కావు.. అవి కాంగ్రెస్ రాజకీయ కమిషన్ నోటీసులు
- ఏం నేరం చేశారని కేసీఆర్‌ను వేధిస్తున్నారు ?
- రేవంత్‌రెడ్డి సర్కార్ తాటాకు చప్పళ్లకు భయపడేది లేదు
- ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, నాయకుల ఆగ్రహం

బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌కు కాళేశ్వరం విచారణ కమిషన్ నోటీసులు ఇవ్వడంపై ఉమ్మడి జిల్లాలో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ కక్షతో కేసీఆర్ ప్రతిష్టను దెబ్బ తీయడానికే కాళేశ్వరం కమిషన్ పేరుతో నోటీసులు ఇచ్చారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. రాష్ట్రాన్ని అద్భుతంగా తీర్చిదిద్దడానికి తన జీవితాన్ని పణంగా పెట్టిన కేసీఆర్‌పై కాంగ్రెస్ చేస్తున్న కుట్రల్లో భాగంగానే ఆయనకు నోటీసులు అందజేశారని పేర్కొన్నారు. చావునోట్లో తలపెట్టి రాష్ట్రాన్ని సాధించి దేశంలో తెలంగాణను అగ్రగామిగా నిలిపిన కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులను పంపడాన్ని కాంగ్రెస్ రాజకీయ కమిషన్ నోటీసులుగానే పరిగణిస్తున్నామని మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో తెలంగాణను సస్యశ్యామలం చేసిన కేసీఆర్‌కు నోటీసులు పంపడం పూర్తిగా రాజకీయ కక్ష పూరిత చర్య అని పేర్కొన్నారు. కేసీఆర్‌కు నోటీసులు జారీ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న కక్ష సాధింపు చర్యలకు పరాకాష్ట అని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. విశ్వఖ్యాతి గాంచిన కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో కేసీఆర్‌కు వచ్చిన పేరుప్రతిష్టలు చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ ప్రభుత్వం విషం కక్కుతోందని మండిపడ్డారు.రేవంత్‌రెడ్డి సర్కార్ తాటాకు చప్పళ్లకు భయపడేది లేదని స్పష్టం చేశారు.

-కంఠేశ్వర్/ ఖలీల్‌వాడి, మే 20

అవి కాంగ్రెస్ రాజకీయ కమిషన్ నోటీసులు

మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

మోర్తాడ్, మే 20: చావునోట్లో తలపెట్టి రాష్ట్రాన్ని సాధించి దేశంలో తెలంగాణను అగ్రగా మిగా నిలిపిన తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులను పంపడాన్ని కాంగ్రెస్ రాజకీయ కమిష న్ నోటీసులుగానే పరిగణిస్తున్నామని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో తెలం గాణను సస్యశ్యామలం చేసిన కేసీఆర్‌కు నోటీసులు పంపడం పూర్తిగా రాజకీయ కక్ష పూరిత చర్య అని పేర్కొన్నారు. నిద్రాహారాలు లెక్క చేయకుండా తెలంగాణ ప్రజల సాగునీటి గోస తీర్చేందుకు కేసీఆర్ కాళే శ్వరం ప్రాజెక్ట్ నిర్మించారని, దీంతో తెలంగాణ కోటి ఎకరాల మాగాణిగా మారిందని, పచ్చని పంటలో కళకళలాడిందని గుర్తుచేశారు. పాలన చేతకాని రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రజల దృష్టి మరల్చేందుకు అవసర మున్నప్పుడల్లా ఇలాంటి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. కేసీఆర్‌పై చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రలను తెలంగాణ సమాజం నమ్మదని పేర్కొన్నారు. తన బొందిలో ప్రాణం ఉన్నంత వరకు తెలంగాణ శ్రేయస్సు కోసమే పనిచేసే కేసీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కుట్రలు చేయడం తెలంగాణ సమాజం సహించదని పేర్కొన్నారు. సూర్యుడి మీద ఉమ్మి వేయాలని చూస్తే అది మీ మీదే పడుతుందన్న విషయాన్ని గమనించాలని, ఇటువంటి చిల్లర రాజకీయాలు మానుకోవాలని ఎమ్మెల్యే వేముల సూచించారు.

రేవంత్‌రెడ్డి సర్కార్ తాటాకు చప్పళ్లకు భయపడేది లేదు

బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఖలీల్‌వాడి, మే 20 : తెలంగాణ రాష్ట్ర తొలి సీఎం కేసీఆర్‌కు నోటీసులు జారీ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న కక్ష సాధింపు చర్యలకు పరాకాష్ట అని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి మండిపడ్డారు. విశ్వఖ్యాతిగాంచిన కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో కేసీఆర్‌కు వచ్చిన పేరుప్రతిష్టలు చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ ప్రభుత్వం విషం కక్కుతోందని మంగళవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. నయా పైసా దుర్వినియోగం జరగకపోయినా ఏదో అవినీతి జరిగినట్లు అబద్ధాలు ప్రచారం చేసి ప్రజలను పక్కదారి పట్టించిన కాంగ్రెస్ జిత్తులమారి రాజకీయం చేసి గోబెల్స్ కూడా సిగ్గుపడుతాడని ఎద్దేవా చేశారు. అసలు ఏం నేరం చేశారని కేసీఆర్‌ను వేధిస్తున్నారని ప్రశ్నించారు. ప్రాణాలను పణంగా పెట్టి తెలంగాణ సాధించినందుకా ? 14 ఏండ్ల ఉద్యమ ప్రస్థానంలో కాంగ్రెస్, బీజేపీలను గడగడలాడించి మెడలు వంచినందుకా ? తెలంగాణ ప్రజల ఆరు దశాబ్దాల కలను సాకారం చేసేందుకు ఆమరణ దీక్ష చేపట్టి చావు నోట్లో తలపెట్టి పోరాడినందుకా ? పదేండ్ల ముందు చూపు పాలనతో తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం కట్టి కోటి ఎకరాలకు సాగునీరిచ్చి తెలంగాణను సస్యశ్యామలం చేసినందుకా ? రైతుబంధు, బీమా ఉచిత విద్యుత్‌తో రైతును రాజును చేసినందుకా ? మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి మంచి నీరిచ్చినందుకా ? అని జీవన్‌రెడ్డి నిలదీశారు. అధికారం కోసం అడ్డగోలు హామీలిచ్చి ప్రజలను ఏమార్చి 1.5 శాతం ఓట్లతో అధికారం దక్కించుకుని తంతే గారెల బుట్టల పడ్డోడు ఇప్పటి సీఎం రేవంత్ అని మండిపడ్డారు. ఏడాదిన్నర తిరగక ముందే పాలన చేతకాక చేతులు ఎత్తేసి లేపి కూతలు కూస్తూ తెలంగాణ పరువును బజారున పడేస్తున్న కాంగ్రెస్ రాష్ట్రానికి అరిష్టమన్నారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో పెట్టుడు తప్ప తిట్టుడు లేదని, సంపద పెంచి పేదలకు పంచడం ఒక్కటే ఆయనకు తెలసని పేర్కొన్నారు. ఏం పాపం చేశారని కేసీఆర్ వెంట పడ్డారో చెప్పాలనిడిమాండ్ చేశారు. విచారణల పేరుతో వేధిస్తే తెలంగాణ ప్రజలు సహించరని జీవన్‌రెడ్డి హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి సర్కార్ తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని స్పష్టం చేశారు. కేసీఆర్‌తో గోక్కున్నోళ్లెవరు బాగుపడలేదని, కేసీఆర్ జోలికొచ్చినందుకు కాంగ్రెస్ తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

ఓ స్ట్రీట్‌కు నామకరణం చేసిన కాలనీవాసులు

కామారెడ్డిలో 'సిందూర్ వీధి'

కామారెడ్డి, మే 20 : భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయవంతమైన నేపథ్యంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్‌లో ఓ వీధికి స్థానికులు మంగళవారం 'సిందూర్ వీధి'గా నామకరణం చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ..భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయవంతమైన నేపథ్యంలో దానిని శాశ్వతంగా గుర్తించుకోవాలనే ఉద్దేశంతో వీధికి సిందూర్ వీధిగా నామకరణం చేసి, బోర్డును ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కాలనీవాసులు రాంరెడ్డి, ఆనంద్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, వెంకటేశం, తిరుపతిగౌడ్, లింబాద్రి, రామచందర్ గౌడ్, కృష్ణంరాజు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

సిందూర్ వీధి బోర్డును ఏర్పాటు చేస్తున్న కాలనీవాసులు

జిల్లాలో రౌడీయిజాన్ని పూర్తిగా నిర్మూలిస్తాం

మాట్లాడుతున్న కామారెడ్డి ఎస్పీ రాజేశ్‌చంద్ర

కామారెడ్డి ఎస్పీ రాజేశ్ చంద్ర

కామారెడ్డి, మే 20 :జిల్లాలో రౌడీయిజాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని కామారెడ్డి ఎస్పీ రాజేశ్‌చంద్ర అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లలో నమోదైన రౌడీషీటర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. రౌడీయిజానికి ప్రోత్సాహమిచ్చే ఎలాంటి చర్యలకు జిల్లాలో చోటులేదని స్పష్టం చేశారు. రౌడీ షీటర్లు మళ్లీ నేరాలకు పాల్పడుతున్న వారిపై కేసులు నమోదు చేసి కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజలను బెదిరించడం,డబ్బులు వసూలు చేయడం, హింసాత్మక చర్యలు చేయడం లాంటి నేరాలను పూర్తిగా మానుకోవాలని సూచించారు.కేవలం మంచి ప్రవర్తన కనబరిచిన వారి రౌడీషీట్లు మాత్రమే తొలగిస్తామని చెప్పారు. నేరరహిత సమాజ నిర్మాణం కోసం జిల్లా పోలీసు యంత్రాంగం అహర్నిశలు కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. సాధారణ జీవితం గడుపుతూ ఎలాంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడకుండా పోలీసు రికార్డ్స్, రౌడీ షీట్లు రివ్యూ కమిటీ నివేదిక ప్రకారం మంచి ప్రవర్తన కలిగి ఉన్న 13 మంది రౌడీ షీటర్లపై రౌడీషీట్లు తొలగించామని తెలిపారు. వీరు భవిష్యత్తులో ఎలాంటి నేరాలకు పాల్పడకుండా తమ కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా జీవించాలన్నదే తమ ఉద్దేశమని పేర్కొన్నారు.13 మందిలో వచ్చిన మార్పులు ఇతరులు కూడా చూసి సత్ప్రవర్తన కలిగి పదేండ్లు ఎలాంటి కేసులు లేకుండా ఉంటే నిష్పక్షపాత విచారణ, రౌడీ షీట్స్ రివ్యూ చేయడానికి ఏర్పాటు చేసిన జిల్లా అధికారుల కమిటీ నివేదిక ప్రకారం వారి షీట్స్ కూడా తొలగిస్తామని వివరించారు. గంజాయి,రౌడీయిజం, హత్యలు, గొడవలు ఇతర అసాంఘిక కార్యకలాపాల్లో తిరిగి పాల్పడిన వారిపై పీడీ యాక్ట్ నమోదుచేస్తామన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి, ఏఎస్పీ చైతన్యారెడ్డి, డీఎస్పీలు శ్రీనివాస్ రావు, విఠల్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ తిరుపతయ్య, డీసీఆర్బీ సీఐ మురళి, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

తాడ్వాయి, బాన్సువాడలో భారీ వర్షం

బాన్సువాడలో జలమయమైన రోడ్లు

లింగంపేట(తాడ్వాయి)/ బాన్సువాడ రూరల్, మే 20: తాడ్వాయి మండల కేంద్రంతోపాటు బాన్సువాడ మండలంలోని బోర్లం, ఇబ్రహీంపేట్, పోచారం రాంపూర్, జక్కల్‌దాని తండా, తిర్మలాపూర్ తదితర గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులతో కూడిన వర్షానికి తాడ్వాయి తహసీల్ కార్యాలయం ఆవరణలో చెట్టుకొమ్మలు విరిగిపడ్డాయి. విద్యుత్ తీగలు సైతం తెగిపడిపోయాయి. కొమ్మలు పడిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. విద్యుత్ తీగలు కింద పడడంతో కార్యాలయానికి వచ్చే గ్రామీణ ప్రాంత ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈదురు గాలుల కారణంగా తెగిపడిన విద్యుత్ తీగలను సరి చేయాలని స్థానికులు కోరుతున్నారు. బాన్సువాడ పట్టణంలోని ప్రధాన రహదారి జలమమయం కాగా.. కాలువను తలపించింది. పలు గ్రామాల్లో పొలంమడుల్లోకి వర్షపు నీరు చేరింది. అధిక ఉష్ణోగ్రతతో అల్లాడిన ప్రజలకు అకాల వర్షం కాసింత ఉపశమనం కలిగించింది.

తాడ్వాయి తహసీల్ ఆఫీస్ ఆవరణలో తెగిపడిన విద్యుత్ తీగలు

కార్మిక సంఘాల నిరసన

నమస్తే తెలంగాణ యంత్రాంగం, మే 20: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలు, కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తే సహించేది లేదని కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు. కేంద్రం కార్మిక సంఘాల పిలుపు మేరకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మంగళవారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్మికులకు వ్యతిరేకంగా కేంద్రం తీసుకువచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులతో 12గంటల కన్నా ఎక్కువ సమయం పనిచేయించే ఆలోచనను విరమించుకోవాలని అన్నారు. బోధన్, ఆర్మూర్, నవీపేట, రుద్రూర్, వర్ని, పిట్లం, బాన్సువాడ తదితర మండలాల్లో కార్మికులతో కలిసి కార్మిక సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు.

బోధన్ సబ్ కలెక్టర్ ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

అర్ధరాత్రి కత్తులతో దొంగల హల్‌చల్

నవీపేట, మే 20: మండలంలోని గాంధీనగర్‌లో సోమవారం అర్ధరాత్రి ముసుగులు ధరించి, చేతుల్లో కత్తులు పట్టుకొని వచ్చిన దొంగలు హల్‌చల్ చేశారు. ఓ కిరాణా షాపు తాళాలు పగుల గొట్టి రూ.ఐదు రుపాయల నాణేలు దొంగిలించుకొని పారిపోయారు. సీసీ కెమెరాల్లో నిందితుల కదలికలు రికార్డయ్యాయి. కిరాణా షాపు యజమాని సుదర్శన్‌రెడ్డి, స్థానికుల కథనం ప్రకారం.. గాంధీనగర్‌లో సుదర్శన్‌రెడ్డి కిరాణాషాపులో దోపిడీకి పాల్పడేందుకు ఎనిమిది మంది దొంగలు నిక్కర్లు, ముఖానికి ముసుగులు ధరించి కత్తులతో వచ్చారు. షాపులో చోరీకి పాల్పడేందుకు గ్రామంలోకి సోమవారం అర్ధరాత్రి 1:10 గంటలకు వచ్చారు. రోడ్డు పై 20 నిమిషాలపాటు కత్తులతో అటూ ఇంటూ తిరుగుతూ హల్‌చల్ చేశారు. చివరికి సుదర్శన్‌రెడ్డి ఇంటి తాళాలు పగుల గొట్టి లోనికి ప్రవేశించి ఐదు రూపాయల చిల్లర నాణేలు మాత్రమే దొంగిలించుకొని పారి పోయారు. మంగళవారం ఉదయం సుదర్శన్‌రెడ్డి భార్య వాకిలి ఊడ్చేందుకు బయటికి రాగా షాపు తలుపులు పగులగొట్టి ఉన్నాయి. ఆందోళనకు గురైన ఆమె తన భర్తకు సమాచారం అందించింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. బాధితుడి నుంచి ఫిర్యాదు తీసుకొని కేసు నమోదు చేస్తామని ఎస్సై వినయ్ పేర్కొన్నారు.

సీసీ కెమెరాలో రికార్డయిన నిందితుల చిత్రాలు